# నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | RAJANNA SIRCILLA




రుక్మాపూర్ సైనిక్ శిక్షణ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు

# పేరుకే సైనిక్ శిక్షణ స్కూల్

- సరిపడా సిబ్బంది లేరు • కేవలం ఐదుగురే ఉంటరా!
- ఆర్మీ అధికారి లేకుండా పిల్లలకు ఏం శిక్షణ ఇస్తరు?
- సరిపడా సిబ్బందిని నియమించండి • పేరెంట్స్ కమిటీ సభ్యుల డిమాండ్

చొప్పదండి, సెప్టెంబర్ 6 : రుక్మాపూర్ సైనిక్ శిక్షణ పాఠశాల పేరుకే ఉందని విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో సహా కేవలం ఐదుగురు ఉన్నారని మండిపడ్డారు. పాఠశాలలో వెంటనే సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ, పాఠశాలలో ఒక ఆర్మీ శిక్షణ అధికారి, 19 మంది స్టాఫ్ ఉండాలని, ఇప్పుడు అరకొర సిబ్బంది, ఒక ప్రిన్సిపాల్‌తో పాఠశాల నడిపిస్తున్నారని మండిపడ్డారు. ఒక ఆర్మీ శిక్షణ అధికారి, ఆర్మీ డైరెక్టర్ లేరని, తాత్కాలికంగా ఉన్న 19 మంది సిబ్బందికి ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. తెలంగాణలో ఏకైక సైనిక్ పాఠశాల ఇలా ఉండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అహర్నిశలు కష్టపడి పిల్లలను ఇందులో చేర్పిస్తే సిబ్బంది లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పిల్లల బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో డైరెక్టర్, ఆర్మీ శిక్షణ అధికారి లేకపోతే విద్యార్థులను దేశానికి సైనికులను ఎలా తయారు చేస్తారని, సీబీఎస్ఈ సిలబస్ పెట్టి ఉపాధ్యాయులు లేకపోతే విద్యార్థులు ఎలా చదువుతారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను నియమించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా, ఈ ఆందోళన విషయమై ప్రిన్సిపాల్ కాళహస్తి వివరణ కోరగా ఎలాంటి స్పందన రాలేదు.

### విద్యార్థులు నష్టపోతున్నరు

సైనిక్ శిక్షణ పాఠశాలలో ఆర్మీ శిక్షణ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చాలా నష్టపోతున్నరు. సిబ్బందికి ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా తొలగించడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నరు. తెలంగాణ ప్రభుత్వం సైనిక్ శిక్షణ పాఠశాలను తీసివేసేందుకు కుట్ర పన్నుతున్నది. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి.

**- నరేశ్, పేరెంట్స్ కమిటీ కార్యదర్శి (వరంగల్)**





నగరంలోని గంజ్‌లో విద్యుత్‌దీపాల అలంకరణ

# గణనాథా నమోనమః

**నిర్విఘ్నం కురుమే దేవా.. సర్వ కార్యేషు సర్వదా!**

సర్వ విఘ్నాలు తొలిగించే దేవుడు వినాయకుడు. ఆ ఆదిదేవుడిని కొలిచే వేళైంది. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించేందుకు భక్తజనం సిద్ధమైంది. శనివారం గణేశుడు కొలువుదీరనుండగా, ఊరూరా మండపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భక్తుల నిత్య పూజలతో నవరాత్రోత్సవాలు ఆధ్యాత్మికతను చాటనున్నాయి. పండుగ నేపథ్యంలో శుక్రవారం మార్కెట్లన్నీ బిజీగా మారాయి. ఎక్కడ చూసినా గణపతులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడిగా కనిపించాయి.

**- వేములవాడ టౌన్, సెప్టెంబర్ 6**




కరీంనగర్: రాంనగర్‌లో సిద్ధమైన 30ఫీట్ల పొడవైన మట్టి గణపతి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, మద్దతుగా పాల్గొన్న టీఎన్జీవోస్ నాయకులు

# దురుసు ప్రవర్తనపై ఆగ్రహం

- మాజీ కార్పొరేటర్ తీరుపై భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- కేసు నమోదు.. మాజీ కార్పొరేటర్ అరెస్ట్
- బల్దియాలో హాట్ హాట్ చర్చ

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 6 : కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులపై మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ ప్రవర్తించిన తీరుపై ఉద్యోగ సంఘాలు భగ్గుమన్నాయి. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగులంతా శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి టీఎన్జీవో నాయకులు మద్దతు తెలిపారు. గురువారం సాయంత్రం టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ ఫిర్యాదు విషయంలో టీపీఎస్ తేజస్వనిపై మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు మెండి చంద్రశేఖర్ దురుసుగా ప్రవర్తించడంతో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్పందించి, అధికారులతో కలిసి కలెక్టర్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భారత్ న్యాయసంహిత 333, 307, 74, 292, 132, 352, 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం మెండి చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా, ఈ విషయంలో ఇప్పటి వరకు అధికార పార్టీకి చెందిన వారెవరూ స్పందించిన దాఖలాలు లేవు. ఈ విషయం కాస్తా ఇప్పుడు నగరపాలక సంస్థలో కార్పొరేటర్లు, ఉద్యోగుల మధ్య చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులపై దురుసు ప్రవర్తన సరికాదంటూ పలువురు చర్చించుకోవడం కనిపించింది.

### కఠిన చర్యలు తీసుకోవాలి: ఉద్యోగులు

మహిళా ఉద్యోగిపై మాజీ కార్పొరేటర్ దుర్భాషలాడుతూ గొడవకు దిగడం చాలా బాధాకరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై రాజకీయ విభేదాలను చూపించడం సరికాదన్నారు. ఈ విషయంపై వెంటనే స్పందించి సహకరించిన నగర కమిషనర్, కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ సువార్త మాట్లాడుతూ, అధికారులు, ఉద్యోగుల నుంచి సామరస్యంగా పనులు చేసుకోవాలే తప్ప దురుసుగా ప్రవర్తించడం సరికాదని సూచించారు. ఆందోళనలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఈఈ యాదగిరి, టీఎన్జీఓ పట్టణాధ్యక్షుడు హర్మిందర్‌సింగ్, నాయకులు గూడ ప్రభాకర్, రాగి శ్రీనివాస్, ఎరుమల్ల శారద, తోట రామస్వామి పాల్గొన్నారు.

### కక్షసాధింపుతో అక్రమ కేసులు : మెండి శ్రీలత

ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసినందుకు మేయర్ కక్ష సాధింపుతో తన భర్తపై అక్రమ కేసులు పెట్టించారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత ఆరోపించారు. శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై పోరాడుతున్నందుకే తమపై మేయర్ సునీల్‌రావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. తమ డివిజన్‌లోని లక్కిరెడ్డి సుకన్య అనే వృద్ధురాలిని మున్సిపల్ అధికారులు రెండు నెలలుగా ముప్పు తిప్పలు పెడుతున్నారని, ఇదే విషయంలో తన భర్త టీపీఎస్ అధికారిని తేజస్వినిని నిలదీస్తే ఆమె ఫైల్‌ను తమ ముఖం మీద కొట్టి 'ఎవరికి చెప్తారో చెప్పుకో' అంటూ విసిరేశారని ఆరోపించారు. తన భర్త ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకపోయేందుకు ప్రయత్నిస్తే కమిషనర్ తన భర్తను 'గెటవుట్' అంటూ దూషణకు దిగారన్నారు. ఈ విషయంలో మేయర్ జోక్యం చేసుకొని తమపై అక్రమ కేసు నమోదు చేయించారని వాపోయారు.

# మత్తు వలలో మైనర్లు!

- పెద్దపల్లి జిల్లాలోని ఓ ప్రభుత్వ స్కూల్లో డ్రగ్స్ కలకలం
- నలుగురు విద్యార్థుల బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లు?
- తల్లిదండ్రులను పిలిపించి మందలించిన టీచర్లు
- ఆగస్టులోనే ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి



పెద్దపల్లి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి కమాన్: పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ కనపడడం కలకలం రేపుతున్నది. ఓ నలుగురు విద్యార్థులు గంజాయి తాగి పట్టుబడినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? మత్తు వలలో ఇంకెంత మంది పిల్లలు ఉన్నారు? విషయం చిక్కు ప్రశ్నగానే మిగిలిపోయింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఓ నలుగురు పదో తరగతి విద్యార్థులు ఆగస్టులో డ్రగ్స్ ప్యాకెట్లను తమ బ్యాగుల్లో పెట్టుకొని స్కూల్‌కు వచ్చారు. బ్రేక్ టైంలో స్కూల్ వెనుక పొలాల దగ్గరికి వెళ్లి గంజాయి తాగడాన్ని స్థానికులు గమనించారు. ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యార్థుల బ్యాగ్స్, పుస్తకాలను తనిఖీ చేశారు. గంజాయి ప్యాకెట్లు బయటపడడంతో కంగు తిన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు తాగినట్టు నిర్ధారణ కావడంతో వారిని బెదిరించి, తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడి వదిలేశారు. ఈ విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్తలు పాటించారు. అయితే పిల్లలకు డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు ఇచ్చారన్న విషయాన్ని మాత్రం వదిలేశారు. ఇప్పటి వరకు పాఠశాలలో నలుగురు విద్యార్థులు డ్రగ్స్ తీసుకుంటున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. డ్రగ్స్ విషయం గ్రామంలో తెలియడంతో మిగతా పిల్లల తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. ఈ విషయమై కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్‌ను సంప్రదించగా.. స్కూళ్లలో డ్రగ్స్ వాడుతున్నట్టు తమ దృష్టికి రాలేదని, సమాచారం వస్తే పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని తెలిపారు.

# లింగనిర్ధారణ నేరం

- ప్రోత్సహిస్తే కఠిన చర్యలు
- డీఎంహెచ్‌వో ఎండీ సమీయుద్దీన్

జగిత్యాల, సెప్టెంబర్ 6: లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని.. ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎండీ సమీయుద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గర్భస్త పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం-జిల్లా సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 73స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. లింగ నిర్ధారణకు అవకాశమున్న సెంటర్లపై నిరంతరం నిఘా ఉంచామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ఆడపిల్లల ప్రాముఖ్యత వివరిస్తూ.. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా చూడాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చేసినట్టు తెలిస్తే సంబంధిత దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డా ఎన్ శ్రీనివాస్, డా జైపాల్‌రెడ్డి, డా అర్చన, స్త్రీ వైద్య నిపుణురాలు వొడ్నాల రజిత, రెడియాలోజిస్ట్ డా సురేందర్, పిల్లల వైద్య నిపుణుడు డా భీమేశ్, ఇన్‌చార్జి డెమో కే భూమేశ్వర్, టీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



# వడ్డేపల్లి ఇకలేరు

- అనారోగ్యంతో సినీగేయ రచయిత కృష్ణ కన్నుమూత
- నివాళులర్పించిన ప్రముఖులు
- సంతాపం ప్రకటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 6: సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ సినీ, గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ(76) శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ తుది శ్వాస విడిచారు. సిరిసిల్లలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌరస్తాలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, సాహితీవేత్తలు ఎలగొండ రవి, వాసరవేని పరశురాములు నివాళులర్పించారు. అలాగే సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్‌ఆకునూరి శంకరయ్య, వెంగళ లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, గెంట్యాల ముత్తయ్య, సడిమెల ఎల్లయ్య, తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

### సాహిత్యంపై అభిరుచి..

సిరిసిల్ల పట్టణంలోని చేనేత కుటుంబంలో లక్ష్మమ్మ-లింగయ్య దంపతులకు 1948 ఆగస్టు 5న కృష్ణ జన్మించారు. సినారె స్ఫూర్తితో సాహిత్యంపై అభిరుచి ఏర్పరుచుకున్నారు. సాహిత్యం, పద్యాలపై మంచి పట్టు ఉండడంతో సినిమాలపై దృష్టిసారించారు. పిల్లజమీందార్ సినిమాలో 'నీ చూపులోన విరజాజివాన.. అమృతకలశంలో సిగ్గాయె సిగ్గాయెరా..' యుగకర్తలు సినిమాలో 'తాగినోడి మాట..తందనాల వేదమాట'తోపాటు పలు చిత్రాల్లో పాటలకు రచనలు అందించారు. లలిత గీతాలు ఆకాశవాణిలో ప్రసారం అయ్యాయి. 1968లో స్రవంతి, కృష్ణాపత్రిక వంటి పత్రికల్లో పద్యాలు, గేయాలతోపాటు కవికళ్యాణం, గడ్డిపువ్వు, గాంధీ, మూడు పువ్వులు, ఆరు కాయలు, సంక్రాంతి లక్ష్మి, స్వదేశీయం, వివేకానంద విజయం, జయజయహే తెలంగాణ, రమణీయ రామప్పతో పాటు అనేక సంగీత రూపకాలు రాశారు. అలాగే ఎక్కడికెళ్తుందో మనసు, లావణ్య విత్ లవ్ బాయ్స్ చిత్రాలకు రచన, దర్శకత్వం వహించారు. బతుకమ్మ, రామప్ప రమణీయం లఘు చిత్రాలకు నంది పురస్కారాలు అందుకున్నారు. 10వేల లలిత గీతాలను పరిశీలించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇటీవల విడుదలైన బలగం సినిమాలో నటించారు. కాగా, వడ్డేపల్లి కృష్ణకు భార్య మణెమ్మ, ఇద్దరు కొడుకులు శ్రీనాథ్, శ్రీకాంత్, కూతురు వాణి ఉన్నారు.

### వడ్డేపల్లి కృష్ణ మృతి బాధాకరం : కేటీఆర్

సినీ గేయరచయిత వడ్డేపల్లి కృష్ణ మరణ వార్త ఎంతో బాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన చెందారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, రచయితగా, పరిశోధకుడిగా దర్శకుడిగా పలు రంగాల్లో తనకంటూ అద్భుతమైన ప్రతిభతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని కొనియాడారు. సాహిత్యరంగంలో వడ్డేపల్లి కృష్ణ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# లైంగికదాడి కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్ల గాంధీ చౌక్ , సెప్టెంబర్ 6 : నాలుగేళ్ల బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుతోపాటు ₹2వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్ ప్రేమలత శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటి దగ్గరలో నిందితుడు చీపెల్లి మల్లయ్య నివాసముండేవాడు. 2018 డిసెంబర్ 25న ఒంటరిగా ఉన్న బాలికకు బిస్కెట్స్ ఇస్తానని చెప్పి, తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. బాలిక ఈ విషయాన్ని మరుసటి రోజు తల్లికి చెప్పడంతో ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదైంది. పోలీసులు రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ పెంట శ్రీనివాస్ వాదించగా, కోర్టు కానిస్టేబుళ్లు నరేందర్, నవీన్ 12 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి, నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.























